క్లుప్తంగా

పంటల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): గండివేట్, పోతంగల్‌కలాన్ శివారులో బుధవారం క్షేత్ర స్థాయిలో వరి పంటలను పరిశీలించినట్లు ఏవో నరేష్ తెలిపారు. వరిలో మెడవిరుపు, కంకినల్లి, అగ్గి తెగులు సోకుతున్నట్లు గుర్తించామన్నారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించినట్లు ఏవో తెలిపారు.

ప్రతి రోజూ వ్యాయామాలు చేయించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రతి రోజు దివ్యాంగ పిల్లలకు ఇంటి దగ్గర వ్యాయామాలు చేయించాలని పిల్లల తల్లిదండ్రులకు ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈవో దేవిసింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపి క్యాంప్ నిర్వహించి వ్యాయామాలు చేయించారు. అనంతరం తల్లిదండ్రులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో గంగాధర్, రాందాస్, రాథోడ్ బలరాం, కంప్యూటర్ ఆపరేటర్ పవిత్ర పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి సీటు బెల్టులు పెట్టుకోని, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు.

పశు వైద్య శిబిరం



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారంలో పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 30 పశువులకు మందులను పంపిణీ చేశారు. 22 గేదెలకు గర్భకోశ వ్యాధులు, 5 సాధారణ చికిత్సలు నిర్వహించారు. 34 పశువులకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మహేందర్, గోపాల మిత్ర సూపర్ వైజర్ తిరుపతి, సిబ్బంది బాబయ్య, హన్మాండ్లు, తదితరులున్నారు.

ఏబీవీపీ నూతన కమిటీ ఎన్నిక

దోమకొండ: దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏబీవీపీ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు సంఘం డెవలప్‌మెంట్ కమిటీ జిల్లా ప్రతినిధి గంధం సంజయ్ తెలిపారు. కళాశాల కమిటీ అధ్యక్షుడిగా మధు, ఉపాధ్యక్షుడిగా సతీష్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా అనూష, ఉపాధ్యక్షురాలిగా రేణుకలను ఎన్నుకున్నారు. కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

ఎండీఎం నిర్వాహకుల నిరసన



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో ఎండీఎం నిర్వాహకులు బుధవారం బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఎండీఎం నిర్వాహకుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, ధరలకు అనుగుణంగా చార్జీలను పెంచాలని వారు డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



రామారెడ్డి(ఎల్లారెడ్డి): నాలుగు రోజుల క్రితం జగదాంబ తండాకు చెందిన సలావత్ రాజునాయక్ రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ రామారెడ్డి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికుంట నర్సాగౌడ్ ఆధ్వర్యంలో రూ.15 వేల నగదుతో పాటు 50 కిలోల బియ్యం రాజు నాయక్ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ అధ్యక్షుడు సలాబత్ భోజ నాయక్, గ్రామ అధ్యక్షుడు నాయిని నర్సింలు, రాజయ్య, బాలయ్య, కుమ్మరి శంకర్, ఎల్లం, రమేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు .

అన్ని హంగులతో పట్టణ అభివృద్ధి

- తాజాగా కేటీఆర్ ప్రకటించిన మరో రూ.20 కోట్లు విడుదల
- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం: మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు తాజాగా కేటీఆర్ ఇచ్చిన మరో రూ.20 కోట్ల నిధులు విడుదలయ్యాయని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తెలిపారు. కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రాన్ని అన్ని హంగులతో సుందరీకరించడం కోసం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత కామారెడ్డి అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో ముందుకు దూసుకు వెళ్తుందన్నారు. ఆరు లేన్ల రోడ్లు, సెంట్రల్ లైటింగ్, సెంట్రల్ మీడియన్, సీసీరోడ్లు, డ్రైనేజీలు, పార్కులు తదితర హంగులతో సిటీ వాతావరణాన్ని తలపిస్తుందన్నారు. తాజాగా కేటాయించిన నిధులతో నిజాంసాగర్ రోడ్డు నుంచి లింగాపూర్ వరకు మిగిలిపోయిన సెంట్రల్ లైటింగ్, మీడియన్ పనులు, ఇందిరా చౌక్, రైల్వే కమాన్, సీఎస్ఐ చర్చ్, నిజాంసాగర్ రోడ్డు, పొట్టి శ్రీరాములు చౌక్, సుభాష్ చౌక్, జయప్రకాష్ నారాయణ సర్కిల్‌లను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ మిన్కూరి రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణంతోపాటు మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి, లింగాపూర్, క్యాసంపల్లి గ్రామాల్లో బుధవారం ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్ సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు రూ.11.50 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. యువకులకు క్రీడా కిట్లను పంపిణీ చేశారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దిన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందుప్రియ, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, కౌన్సిలర్లు కాసర్ల స్వామి గోదావరి, కృష్ణాజీరావు, ఉరుదొండ వనిత, పడిగే సుగుణ, బండారి నర్సారెడ్డి, బండారి రాంరెడ్డి, షానూర్ పాల్గొన్నారు.



క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేస్తూ..

నేడు రాజంపేటకు ప్రభుత్వ విప్

రాజంపేట: మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభానికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ గురువారం విచ్చేస్తున్నట్లు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు భిక్కాజీ బల్వంత్ రావు బుధవారం తెలిపారు. విజయవంతం చేయాలని వారు కోరారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

– అనారోగ్య కారణంతో ఎమ్మెల్యే గైర్హాజరు

రాజంపేట: రాజంపేట మండలం ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సిద్ధాపూర్, గుండారం ఎల్లారెడ్డిపల్లి, కొండాపూర్, ఆర్గొండ, బస్వన్నపల్లి, నడిమితండా, గడితండా, శేర్‌శంకర్‌తండాతో పాటు మొత్తం 12 గ్రామ పంచాయతీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, రోడ్లు, భవనాలను ఎంపీపీ లింగాల స్వరూప, జెడ్పీటీసీ కొండ హన్మాండ్లు, స్థానిక సర్పంచులతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్ అనారోగ్యం కారణంగా ప్రారంభోత్సవాలకు రాకపోవడంతో ఆయన ఆదేశాలకు మేరకు అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు ఎంపీపీ లింగాల స్వరూప తెలిపారు. 26 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు బుధవారం స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు.



సిద్ధాపూర్‌లో జీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ స్వరూప

మెల్లకుంటతండా గ్రామ హద్దులు నిర్ణయించండి

ఎల్లారెడ్డి: నాగిరెడ్డిపేట మండలంలోని మెల్లకుంటతండా గ్రామానికి హద్దులను నిర్ణయించాలని కోరుతు తండావాసులు బుధవారం ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్‌కు వినతిపత్రం అందించారు. జాన్కంపల్లి గ్రామ పంచాయతీ నుంచి నూతనంగా మెల్లకుంటతండా జీపీగా ఏర్పడిందని, జీపీ ఏర్పడినప్పటికి మెల్లకుంటతండా పరిధిలో సైతం ఇంటి నిర్మాణాలకు జాన్కంపల్లి వారు అనుమతులివ్వడం, మెల్లకుంటతండా జీపీ భవన నిర్మాణానికి జాన్కంపల్లి వారు అడ్డుతగలడం ఇబ్బందికరంగా ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని హద్దులను నిర్ణయించాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న మెల్లకుంటతండావాసులు

తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మాచారెడ్డి: డ్వాక్రా సంఘాలలో రుణాలు పొందిన మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సెర్ప్ ఎగ్జిక్యూటివ్ గోవిందరావు అన్నారు. బుధవారం పాల్వంచ మండల కేంద్రంతో పాటు దేవునిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఆయన వెంట డీపీఎం రమేశ్ బాబు, ఏపీఎం శ్రీనివాస్ ఉన్నారు.



డ్వాక్రా మహిళ ఏర్పాటు చేసుకున్న వ్యాపార సముదాయాన్ని పరిశీలిస్తున్న ఐకేపీ అధికారులు

తపాలా సిబ్బంది ఆందోళన



లింగంపేట తపాలా కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న తపాలా ఉద్యోగులు



సదాశివనగర్‌లో..

సాక్షి నెట్‌వర్క్:జిల్లాలో పలుచోట్ల తపాలా శాఖలో పని చేస్తున్న బీపీఎం, జీడీఎస్ సిబ్బంది బుధవారం ఆందోళనకు దిగారు. తపాలా కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎనిమిది గంటల పని, పెన్షన్‌తో పాటు అన్ని ప్రయోజనాలను కల్పించాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు పెంచాలన్నారు. జీడీఎస్‌లపై పని ఒత్తిడి తగ్గించాలన్నారు. బీపీఎంతో పాటు సీనియర్ జీడీఎస్‌లకు ఇంక్రిమెంట్ ఇవ్వాలని, గ్రాట్యుటీ రూ.5 లక్షలకు పెంచాలని కోరారు.



పిట్లంలో..



ఎల్లారెడ్డిలో ..

పదోన్నతులు కల్పించాకే బదిలీలు చేపట్టాలి



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో భాగంగా ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేశారు. కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టిన అనంతరం డీఈవో చాంబర్ ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. ప్లకార్డులను ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. డీఈవో రాజుతో మాట్లాడారు. ఉపాధ్యాయులకు అన్యాయం చేయవద్దని కోరారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవ్‌లా, టీపీఆర్‌టీయూ నేత లక్ష్మీరాజం, ఎస్జీటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు చేప పిల్లల విడుదల

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టులో గురువారం చేప పిల్లలతో పాటు రొయ్య పిల్లలను విడుదల చేయనున్నట్లు జిల్లా మత్స్య శాఖాధికారి వరదారెడ్డి తెలిపారు. విడుదల కార్యక్రమానికి జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, ఎంపీపీ పట్లోళ్ల జ్యోతిదుర్గారెడ్డి అతిథులుగా హాజరవుతారని అన్నారు.

క్రీడా పరికరాల కిట్ల పంపిణీ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో గురువారం క్రీడా పరికరాలను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో కొండ లక్ష్మి బుధవారం తెలిపారు. ప్రతి కిట్‌లో క్రికెట్, వాలీబాల్, జిమ్, డిస్కస్‌త్రో, టెన్నికాయిట్ రింగ్, స్కిప్పింగ్ రూప్స్, విజిల్‌సామగ్రి ఉంటుందన్నారు.

7న శౌర్య జాగరణ పాదయాత్ర


ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నుంచి గోపాల్‌పేట్ వరకు వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈనెల 7న శౌర్య జాగరణ మహా పాదయాత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ నాయకులు బుధవారం తెలిపారు. ఈ నెల 7న ఎల్లారెడ్డిలోని హనుమాన్ ఆలయం నుంచి గోపాల్‌పేట్ రామాలయం వరకు శౌర్య జాగరణ పాదయాత్ర నిర్వహించనున్నామని అన్నారు.

‘ఐదు శాతం ఐఆర్ నిరాశకు గురి చేసింది’



కామారెడ్డి అర్బన్: సీఎం కేసీఆర్ పీఆర్‌సీని నియమించడాన్ని స్వాగతిస్తున్నామని, ఇదే సమయంలో 5 శాతం ఐఆర్ ప్రకటించడం పట్ల ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందని టీఎస్‌జీవో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరాల వెంకట్‌రెడ్డి, బి.సాయిలు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని టీఎస్‌జీవోస్ గదిలో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాలు 2008లో 22 శాతం , 2013లో 27శాతం ఐఆర్ ప్రకటించాయని గుర్తుచేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు, రావాల్సిన రెండు డీఏలను పరిగణనలోకి తీసుకుని ఐఆర్‌ను కనీసం 15 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌జీవో నేతలు నాగరాజు, సాయిలు, బి.రాజేశ్వర్, సంతోష్ , కల్పన పాల్గొన్నారు.

గుర్తు పట్టేది ఎలా?



రామారెడ్డి (ఎల్లారెడ్డి): మార్కెట్లో వస్తున్న రూపాయి బిట్టును పోలి ఉన్న రూ.2 బిట్టును గుర్తుపట్టడం ప్రజలకు కష్టంగా మారింది. దీంతో రెండు రూపాయల బిట్టు కూడా రూపాయిగానే వెలకట్టి మోసపోతున్నారు. మార్కెట్లో రూపాయి, రెండు రూపాయలకు పెద్దగా తేడా లేకపోవడంతో ప్రజలు కూడా పట్టించుకోవడం లేదు. రెండూ ఒకే విధంగా ఉండటంతో చాలా మంది ముసలివాళ్లకు ఇబ్బందిగా మారింది.



భిక్కనూర్‌లో..

బతుకమ్మ చీరల పంపిణీ

సాక్షి నెట్‌వర్క్:రాష్ట్ర ప్రభుత్వం దసర పండుగ కానుకగా అందించిన బతుకమ్మ చీరలను బుధవారం జిల్లా వ్యాప్తంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. అదేవిధంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి క్రీడా కిట్లను కూడా పంపిణీ చేస్తుందని, వారు చెప్పారు.సదాశివనగర్ మండలానికి 14వేల 280 బతుకమ్మ చీరలు వచ్చినట్లు స్థానిక ఎంపీడీవో లక్ష్మి తెలిపారు.



పిట్లంలో..



మోడెగాంలో..

అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉంటాయి



గృహలక్ష్మి ప్రొసీడింగ్ కాపీలు అందిస్తున్న స్పీకర్



మద్దెలచెరువులో .. బీఆర్ఎస్ నేతలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను బుధవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. దీనిలో భాగంగా గ్రామంలో నూతనంగా రూ.1.30 కోట్లతో నిర్మించిన సమీకృత భవనం, రూ.11 లక్షలతో గ్రంథాలయం, రూ.19 లక్షలతో అంగన్‌వాడి భవనాలను ప్రారంభించారు. గంగమ్మ గుడి, అంబేడ్కర్ భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇది వరకు మండల కేంద్రంలో పనుల కోసం వివిధ కార్యాలయాలకు తిరగాల్సి ఉండేదని, కాని ప్రస్తుతం ఒకే చోట అన్ని కార్యాలయాలు ఉంటాయన్నారు. 376 గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను,73 కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. ఎంపీపీ పాల్త్య విఠల్, జెడ్పీటీసీ జన్నుబాయి, ఆర్డీవో భుజంగరావు, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మద్దెలచెరువులో 15 మందికి..

పిట్లం(జుక్కల్): మద్దెలచెరువులో 15 మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి ప్రొసీడింగ్ కాపీలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ రమేష్ గౌడ్, ఎంపీటీసీ నారాయణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి

మద్నూర్(జుక్కల్): సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు నాగార్జున, ఉమాదేవిలు సూచించారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఆర్‌బీఎస్‌కే బృందం ఆరోగ్య శిబిరం, వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. దోమలు కుట్టకుండా, పుట్టకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్‌గున్యా తదితర వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీటి నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన శివాని, గంగోత్రిలకు వారు బహుమతులను అందించారు. హెచ్‌ఎం శంకరయ్య, భీమ్, భాగ్యలక్ష్మి, జ్యోతి, లావణ్య తదితరులున్నారు.



బహుమతులను అందజేస్తున్న వైద్యులు

దుకాణాలు కోల్పోతున్న వారిని ఆదుకోవాలి

మద్నూర్(జుక్కల్): మద్నూర్‌లో సెంట్రల్ లైటింగ్ కోసం ఎమ్మెల్యే హన్మంత్ సింధే శంకుస్థాపన చేయడం మంచి విషయమేనని, రోడ్డు వెడల్పులో దుకాణాలు కోల్పోతున్న వ్యాపారులను ఆదుకోవాలని కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు తమ్మెవార్ భగవాన్, మైనార్టీ నాయకుడు సుల్తాన్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం వారు మాట్లాడుతూ.. వ్యాపారులు, రోడ్డు వెడల్పుతో ఉపాధి కోల్పోతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సెంట్రల్ లైటింగ్ పనుల్లో దుకాణాలు కోల్పోయిన వారికి గ్రామ పంచాయతీ అధికారులు స్థలం చూపించి వ్యాపారాలు కొనసాగేలా చూడాలని వారు పేర్కొన్నారు. జాతీయ రహదారితో వాహనాలు అన్ని ఊర్లోకి రాకపోవడంతో అసలుకే వ్యాపారాలు డీలా పడ్డాయని, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేను కోరారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సమయపాలన పాటించని తహసీల్ సిబ్బంది



ఉదయం 10 గంటలకు తెరుచుకోని పెద్దకొడప్‌గల్ తహసీల్ కార్యాలయం



మధ్యాహ్నం 3.30 గంటలకు ఖాళీ కుర్చీలతో దర్శనం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): స్థానిక తహసీల్ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. బుధవారం తహసీల్ కార్యాలయం ఉదయం 10 గంటలకు తెరవాల్సిన తాళం, 10.15 గంటలకు తాళం తెరిచారు. అలాగే మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో తహసీల్ కార్యాలయంలో సిబ్బంది ఎవ్వరూ లేకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సమయపాలన పాటించకపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి



ఎల్లారెడ్డిలో భిక్షాటన చేస్తున్న ఆశావర్కర్లు



సదాశివనగర్‌లో ..

సాక్షి నెట్‌వర్క్:జిల్లాలో ఆశావర్కర్లు బుధవారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వ ఉద్యోగులుగా తమను గుర్తించాలని కోరారు. అలాగే కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇతర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. అప్పటి వరకు సమ్మె విరమించబోమని చెప్పారు. పలువురు సంఘీభావం తెలిపారు.



దోంగ్లీలో ..

గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభం

లింగంపేట(ఎల్లారెడ్డి): రాంపూర్‌లో జీపీ నిర్మాణానికి ఉపసర్పంచ్ యాదాగౌడ్ బుధవారం భూమిపూజ చేశారు. గ్రామ పంచాయితీ నిర్మాణం కోసం రూ. 20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి నగేష్, మహేష్, నాగరాజు, కిషన్, నాగయ్య, పర్శురాం పాల్గొన్నారు.



రాంపూర్‌లో భూమిపూజ చేస్తున్న యాదాగౌడ్